# మహాలక్ష్మమ్మ

- కొత్తపల్లి ఉదయబాబు

ఆ హాల్లో మహాలక్ష్మమ్మగారి దర్శనం కోసం ఆరుగురు వ్యక్తులు వారి వారి వెంట తెచ్చిన వస్తువులతో రెడీగా ఉన్నారు. వారువచ్చి చాలా సేప యినట్లుగా వారి చూపులు గుమ్మానికి వ్రేలాడుతున్న పలుచని పరదాని పదే పదే స్పృశిస్తున్నాయి.

వారి నిరీక్షణ పరిశీలించినట్టుగా మరో రెండు నిముషాలు దేవునికి హారతి ఇచ్చి నట్లుగా గంట వినిపించింది.

మరో అయిదు నిముషాలలో ఎరుపు అంచు వున్న ఆకుపచ్చ రంగు పట్టుచీర, మేచింగ్ జాకెట్, రెండు చేతులకు బంగారు వంకీలు, రెండు చేతులకు డజను చొప్పున తెల్లరాళ్ళు పొదిగిన బంగారు గాజులు, మెడలో రెండు పేటల మంగళ సూత్రాలతోపాటు ఆరుపేటల చంద్రహారాలతోపాటు రెండు పేటల పలకసర్లు, రెండు పేటల కాసి కాయగుళ్ళు, గోవర్ధనం ముడి వేసి చుట్టిన ముత్యాలహారం, వడ్డాణం, నుదుట పావలా కాసంత ఎర్రని కుంకుమ, నిమ్మ గుత్తి ముక్కు పుడక, నున్నగా దువ్వి వేసుకున్న ముడిలో ఎర్ర రాళ్ళు పొదిగిన చంద్రవంక, దేశవాళీ పసుపుకొమ్ములతో చేసిన పసుపుతో స్నానం చేసినట్లు పచ్చని పసిమితో లక్ష్మీదేవి వైకుంఠం విడిచి వచ్చిందా అన్నట్లుగా ఉన్న ఆమెను చూస్తూనే భక్తి పూర్వకమైన గౌరవంతో చేతులు జోడించి నమస్కరించారు హాల్లో వున్న వ్యక్తులు.

ఆమె ఠీవిగా వచ్చి చెక్క పడక కుర్చీలో కూర్చున్నారు.

పనిమనిషి ఆమె ముందు మూత చుట్టు నాలుగు మూలలా ఇత్తడి పువ్వులు తాపడం చేసిన నగిషీ చెక్క పెట్టె పెట్టి లోపలకు వెళ్లిపోయింది.

ఆమె ఆ పెట్టె తెరిచి మూత లోపల వైపున వున్న లక్ష్మీదేవి బొమ్మకు మనస్ఫూర్తిగా నమస్కరించారు. ఆ తరువాత దాని లోపల వున్న నోట్ల కట్టలు తీసి టీపాయ్ మీద పెట్టి అందులోంచి ప్రామిసరీ నోట్ల కట్టను, ఖాళీ ప్రామిసరీ నోట్లను, పెన్ను తీసి బయట పెట్టారు.

మొదటి వ్యక్తిని పిలిచారు.

"ఏమయ్యా! ఏం కావాలి?"

"అమ్మా నా పేరు కేశవులు. ఈ ఉంగరం పెట్టుకుని ఎంత ఇస్తారో ఇవ్వండమ్మా!"

ఆమె దాన్ని చేతుల్లోకి తీసుకుని చూసారు.

"నీకు ఎంత కావాలి?"

"అయిదు వందలు కావాలమ్మా."

"అవసరం ఏమిటి?"

"అమ్మాయిని పురుటికి తీసుకొచ్చానమ్మా!"

"ఆ మాట అమ్మవారి మీద ఒట్టేసి చెప్పు."

"మా అమ్మాయిని అమ్మమీద ఒట్టుగా పురుటికి తీసుకొచ్చానమ్మ."

"ఈ ప్రామిసరి నోటుమీద సంతకం పెట్టు."

"సంతకం రాదమ్మా."

"అయితే వేలిముద్ర వేయి" ఆమె ప్రామిసరీ నోటుమీద ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసి అతని అడ్రస్ వివరాలు నోట్ చేసుకుని అయిదువందల రూపాయలు అతని చేతికిస్తూ అన్నారు.

"చూడు! ఈ ఉంగరం నా దగ్గరే వుంటుంది. నెలకు నూటికి రెండు రూపాయలు ధర్మ వడ్డీ. సరిగ్గా మూడు నెలలలోపు బాకీ తీర్చేయాలి. తీర్చకపోతే ఉంగరం నా అప్పు బాకీ క్రింద జమ కట్టేసుకుంటాను. చూడు. ఈ వేళ తారీకు ఏడు. సరిగ్గా మూడు మాసాల తరువాత ఏడవ తారీకు సాయంత్రం అయిదుగంటలలోపు బాకీ తీర్చేయాలి. నెల మధ్యలో వచ్చినా పూర్తి వడ్డీ తీసుకుంటాను సరేనా."

"అలాగేనమ్మా" అతను ఆ డబ్బు కళ్లకద్దుకుని వెళ్లిపోయాడు.

ఆవిడ అలాగే మిగతా వారి దగ్గర నుంచి ఒక ఇత్తడి బిందె, రెండు ఇత్తడి బక్కెట్లు, ఒక బంగారు గొలుసు, ఒక జత చెవి దిద్దులు తీసుకుని వారికి డబ్బు ఇచ్చి పంపింది.

ఆ రోజు లెక్కలు పూర్తి చేసుకుని మళ్లీ అన్నీ పెట్లో పెట్టి మూయబోతున్నంతలో రిక్షా దిగి హడావుడిగా లోపలకు వస్తున్న వనజాక్షినిగారిని చూస్తూనే ఎదురువెళ్లారు.

"రండి వదినా రండి. ఎంత కాలమైంది మిమ్మల్ని చూసి? ఎలా వున్నారు? మా అన్నయ్యగారు ఎలా వున్నారు? పిల్లలంతా కులాసానా?" అని అడిగారు.

ఒక్కసారిగా మహాలక్ష్మమ్మగారి భుజంమీద తల వాల్చి బావురుమంది వనజాక్షి.

"అరె! ఏమిటి ఏమైంది వదినా! నాతో చెప్పరూ?" అన్నారావిడ వనజాక్షి చెయ్యి పుచ్చుకుని హాల్లో వ్రేలాడుతున్న ఉయ్యాలమీద తన ప్రక్కనే కూర్చోబెట్టుకుంటూ.

"వదినగారూ! మీ అన్నయ్యగారికి అర్జంటుగా అపెండిసైటిస్ ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. ఈ ఊళ్లోనేవున్న ఆయన తమ్ముడి దగ్గరకు వెళ్తే నా మెడలో వున్న చంద్రహారాలు, మంగళసూత్రం ఇస్తే అమ్మి డబ్బు తెస్తానన్నాడు. ఏం చేయాలో తెలీక సలహా కోసం మీ దగ్గరకు వచ్చాను. ముప్పై ఏళ్ల క్రితం వారు కట్టిన మంగళసూత్రం వారి కోసమే అయినా తీయడం ఇష్టంలేక పోయింది. స్నేహమాధుర్యాన్ని చవి చూసి స్నేహంలో జీవించడం నేర్పిన స్నేహశీలి మిమ్మల్ని నమ్ముకుని ఇంత దూరం వచ్చాను. అడగకుండానే అన్నగారికి సహాయం చేయాల్సింది పోయి మంగళసూత్రాన్నే అమ్మి పెడతానన్న అతని దుర్మార్గపు బుద్ధిని అసహ్యించుకుని మీ దగ్గరకు వచ్చాను. ఇది మీ దగ్గర తాకట్టు పెట్టినా నాకిష్టమే. ధర కట్టి తీసేసుకున్నా నాకిష్టమే. దయచేసి ఆపరేషన్ టేబుల్ మీద వున్న ఆయనను కాపాడండి" దోసిలిలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చేసింది వనజాక్షి.

మహాలక్ష్మమ్మగారి కళ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఆప్యాయంగా వనజ భుజం తట్టి వెన్ను నిమిరారు.

"ఊరుకోండి వదినా! నేను లేనూ. ముందు వచ్చి రెండునిముషాలు ప్రశాంతంగా కూర్చోండి" అంటూ ఆమెను చేయి పట్టి తీసుకెళ్లి ఊయల బల్ల మీద కూర్చోబెట్టి ఫాను స్పీడు పెంచి "మంగీ" అని పిలిచారు.

రెండు నిముషాలలో "ఏంటమ్మగారు" అంటూ వచ్చింది మంగి.

"చూడు అమ్మగారు ముఖం కడుక్కుంటారు. అన్నీ సిద్ధం చేయి. ఆ తరువాత వేడి వేడిగా కాఫీ తీసుకురా. ఆవిడ పంచదార ఎక్కువ వేసుకుంటారు. తెలుసుకదా. వదినగారూ! మీరు వెళ్లి ముఖం కడుక్కురండి" అంటూ సాగనంపి ఆలోచనలో పడ్డారు మహాలక్ష్మమ్మగారు. ముఖం కడుక్కుని వచ్చి ఫానుక్రింద కూర్చున్న వనజాక్షిగారికి మనసులో మంట క్రమేపీ తగ్గి తేలిక పడుతున్నట్లుగా అనిపించసాగింది. ఆవిడ మంగి ఇచ్చిన కాఫీ తాగుతుంటే మహాలక్ష్మమ్మగారు లోపలకు వెళ్లి పదివేల రూపాయల కట్టతో తిరిగివచ్చారు.

దాన్ని వనజాక్షి చేతిలో వుంచారు.

వనజాక్షిగారికి మళ్ళీ దుఃఖం ముంచుకొచ్చింది. నోట్ల కట్టను ఊయల బల్లమీద పెట్టి వంగి మహాలక్ష్మమ్మగారికి నమస్కరించబోయింది.

అయితే మహాలక్ష్మమ్మగారు మధ్యలోనే ఆపి "వదినగారూ! ఏమిటీ పని?'' అన్నారు.

వనజాక్షి మెడలో చంద్రహారాలు, మంగళసూత్రాలు తీయబోయారు. మహాలక్ష్మమ్మగారు వారిస్తూ అన్నారు.

"తప్పు వదినగారూ! చాలా తప్పు. మీరు తీసేస్తే మాత్రం నేను అవెలా తీసుకుంటాననుకున్నారు? నాకే ఒక అక్కయ్యో, చెల్లెలో ఉంటే నాకు తోచిన సాయం చేసేదాన్ని కదా. మీరు ఈ డబ్బు పట్టుకుని వెళ్ళి ముందు హాస్పిటల్ బిల్ కట్టండి. నేను పది నిముషాల తరువాత వస్తాను.''

ఆ మాటలతో వనజాక్షిగారు ఇంకా కదిలిపోయింది.

"తప్పమ్మా! ఆయన అలా మంచం మీద ఉన్నప్పుడు మీరిలా కంట తడి పెట్టడం నాకు అస్సలు నచ్చని విషయం. ఆడది ఇలాంటి సమయంలోనే ధైర్యంగా ఉండాలి. లేకపోతే పిల్లల పరిస్థితి ఏమిటి? మీరు దేని గురించీ ఆలోచించకుండా వెళ్ళండి. ఆయనకు తప్పక తగ్గుతుంది. ఆ దేవుడు మిమ్మల్ని చల్లగా చూస్తాడు'' అంటూ ధైర్యవచనాలు చెప్పి మరీ సాగనంపారావిడ వనజాక్షిగారిని.

చిక్కబట్టుకున్న మనసుతో మహాలక్ష్మమ్మగారి సహాయానికి వేల వేల కృతజ్ఞతలు మనసులో చెప్పుకుంటూ బయల్దేరారు వనజాక్షిగారు.


***

కొన్ని కుటుంబాలలో ఇంటి యజమాని మగవాడైనప్పటికీ స్త్రీ యొక్క చాతుర్యంవల్ల, పదిమందికీ సహాయపడే గుణంవల్ల, పదిమందితో కలసిపోయే గుణంవల్ల ఆడదే ఆ ఇంటి యజమానురాలిగా కీర్తింపబడుతుంది. సరిగ్గా ఆ కోవకు చెందిన స్త్రీయే మహాలక్ష్మమ్మగారు.

మహాలక్ష్మమ్మగారి భర్త రామభద్రయ్యగారు కొవ్వూరు సంస్కృత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా చేస్తున్నారు. మూర్తీభవించిన మంచితనానికి ప్రతీక. త్రికరణశుద్ధిగా రెండు పూటలా సంధ్యావందనం చేసి గాయత్రీ జపం చేసే ఉత్తముడాయన. భాగవత సారాన్ని ఒంట పట్టించుకుని ప్రతిరోజూ సాయంత్రం వూరిలోని కోవెలలో ఒకదానిలో పురాణ కాలక్షేపం చేస్తారు. అటువంటి సద్బ్రాహ్మణునకు ఒక అమ్మాయి, ఇద్దరబ్బాయిలు. అమ్మాయికి చక్కని సాంప్రదాయబద్ధమైన సంబంధమే చేసారు. అయితే ఆ అల్లుడు కష్టపడకుండా వచ్చే సొమ్ము ఆశించే రకం. అల్లుడి ఆగడాలు చూసిన మహాలక్ష్మమ్మగారు మూడుసార్లు అతనికి డబ్బు సాయం చేసి ఏదో ఒక వ్యాపారం చేయమని ఇస్తే ఆ సొమ్ము ఫ్రెండ్స్‌తో జల్సాచేసి భార్యను బిడ్డ తల్లిని చేయగలిగాడు.


"నువ్వు సమర్థుడైననాడు నా ఇంటికి వచ్చి నా కూతుర్ని తీసుకువెళ్ళు. నా కూతురు పెళ్ళాన్ని పోషించుకోలేని ఒక వాజమ్మ భార్య అని పదిమందిచేత అనిపించుకున్నా సరే నా ఇంట్లోనే వుంటుంది. అంతవరకూ ఇంటి ఛాయలకు వస్తే పోలీసు రిపోర్టు ఇచ్చి నిన్ను నానా ఇక్కట్లు పెట్టాల్సి వస్తుంది. ఆ పరిస్థితులు నాకు కల్పించబోకు'' అని హెచ్చరించి కూతురికి అల్లుడి పీడ వదిలించిన ధైర్యశాలి. కుమార్తెకు మధ్యలో ఆపేసిన చదువును పూర్తి చేయించి టీచర్ ట్రైనింగ్‌కు పంపి ఆమె చేత సొంత కాన్వెంటు ఓపెన్ చేయించిన ధీరోదాత్తురాలు. ఈవేళ రెండువందలమంది పిల్లలతో ఆ కాన్వెంట్ అలరారుతుందంటే స్త్రీకి





## వినోదమే ప్రధానం

బిపాషాబసు సినిమా అంటే అందరికీ ఆసక్తే. కనులు చెదిరే అందంతో అందర్నీ ఆకట్టుకునే నటన సొంతం చేసుకున్న బిపాషా కొత్త చిత్రం గురించి అందరూ చర్చించుకుంటున్నారు. 'సుహాగ్', 'హోగీ ప్యార్ కీ జీత్', 'ఆషిక్' వంటి హిట్ చిత్రాలందించిన అనిల్ శర్మ నిర్మాతగా జాన్ అబ్రహాం, బిపాషాబసు, ప్రియాంశుచటర్జీ, రాజీవ్ వర్మల నటిస్తున్న కొత్త చిత్రం 'మమ్‌కిన్'షూటింగ్ ఈమధ్యే ప్రారంభమైంది. బిపాషా గ్లామర్‌కి తగ్గట్టుగా రూపొందుతున్న ఈ చిత్రం పూర్తి వినోద ప్రధానంగా సాగుతుందంటున్నారు నిర్మాత, దర్శకులు.




సరైన అవకాశమిచ్చి ప్రోత్సహిస్తే జాతినే నడిపించ గలదు. అవసరమైతే జాతి నేతలనే తరగతి గదిలో తయారు చేయగలదు అని ప్రశంసించినవారు అరుదు. ఆ పుణ్యం మహాలక్ష్మమ్మగారిదే.

తన కుటుంబ సభ్యుల సమస్యలనే కాదు, మరే ఇతర కుటుంబ సమస్యకైనా తన పరిధిలో చక్కని పరిష్కారం చూపగల మహాలక్ష్మమ్మగారు రామభద్రయ్యగారికన్నా మంచి పేరు సంపాదించారు. ఆయన ప్రశాంత గోదావరి, ఆమె ఎగిసిపడే కడలి తరంగం. పిల్లలిద్దరూ ఉన్నతమైన స్థితిలో వున్నారు. నెలకు నలభైవేల రూపాయల జీతగాళ్ళ తల్లి ఆమె. ఒకడు గవర్నమెంటు ఫస్ట్‌గ్రేడ్ ఆఫీసర్, మరొకడు ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్. ఇంటికొచ్చిన సహాయార్థికి సహాయం చేయకుండా పంపడం అనేది ఆమె గృహిణి జీవితంలో లేనేలేదు.

ఒకనాటి రాత్రి ఒక దొంగ వారింట్లో జొరబడ్డాడు. నగలు, వస్తువులు మూటగట్టాక రెండురోజులుగా భోజనం లేకపోవడంతో వాడు వంటగదిలో జొరబడ్డాడు,. ఆ అలికిడికి లేచిన మహాలక్ష్మమ్మగారు వాడిని ధైర్యంగా జుట్టు పట్టుకుంది. కత్తితో పొడుస్తానన్న వాడి చేతిలో కత్తి తీసుకుని వాడిని కూర్చోబెట్టి విషయం కనుక్కుంది. ఆ రోజు ఇంట్లో ఆమె తప్ప మరెవ్వరూ లేరు.

వాడి పెళ్లాం వాడిని ఇంటికి డబ్బు సంపాదించి తెస్తేనే రమ్మందిట. లేకపోతే 'నువ్వు చచ్చావనుకుని తెల్లచీర కట్టుకునైనా బతుకుతానుగానీ నీ పెళ్లాన్ని అని మాత్రం చెప్పుకోను' అందిట. దాంతో పౌరుషం వచ్చిన వాడు మొదటిసారిగా దొంగతనం చేయడానికి వచ్చాడుట. రెండురోజులుగా తిండి తిననేలేదుట.

మహాలక్ష్మమ్మగారి కళ్ళు చెమర్చాయి.

'ఏ ఆడదానికైనా మగవాడు ఒకలాగే అన్యాయం చేస్తాడేమో' ఆమెకు కూతురు గుర్తుకు వచ్చింది. అనంతరం వాడిని స్తంభానికి తాడుతో కట్టేసింది. తాను ఆ రాత్రి భోజనం చేయకపోవడంతో రెండు పళ్ళు తిని మజ్జిగ తాగి పడుకుంది.

వంట గిన్నెలు ఖాళీగా ఉన్నాయి. ఆమెకు ఏమనిపించిందో ఏమో! వేడివేడిగా సోలెడు బియ్యం అన్నం వండి, పప్పుచారు పెట్టింది. అరగంట తరువాత వేడివేడి అన్నంలో ఆవకాయ, పప్పుచారు, పెరుగుతో వాడు సుష్టుగా భోజనం చేస్తుంటే ఆమెలో మాతృప్రేమ పొంగి పొర్లింది. సాక్షాత్తూ అన్నపూర్ణాదేవే వచ్చి అన్నం పెట్టినట్టు ఫీలయిన వాడు ఆమెకు సాష్టాంగ పడిపోయాడు.

"అమ్మా! నన్ను చమించండమ్మా. జీవితంలో ఇదే మొదలు, ఇదే ఆకరు. జీవితంలో దొంగతనం సేత్తే మీ పాదాల మీద ఒట్టు. మీరెట్టిన అన్నం మీద ఒట్టు, కట్టపడి సంపాదించి నా భార్యని పోసించుకుంటాను'' అన్నాడు వాడు ఆవేశంగా.

"అయితే నే చెప్పినట్టు చేస్తావా?'' అన్నారావిడ.

"సెప్పండమ్మా. మీ తరువాతే నాకెవరైనా. మీరేం సెబితే నేనది సేత్తా'' అన్నాడు వాడు.

అప్పటికే వడ్డీ తాకట్టు వ్యాపారం చేస్తున్న మహాలక్ష్మమ్మ వాడికి తన గోడౌను చూపించింది. అందులో పన్నెండు సైకిళ్ళున్నాయి.

"ఈ సైకిళ్ళు తీసుకుని అద్దె సైకిలు షాపు పెట్టుకో. రోజుకు నీకు వచ్చినదాంట్లో మూడువంతులు నాది, ఒక వంతు నీది. సరేనా!''

వాడు ఒప్పుకున్నాడు.

ఏడాది తరువాత వాడి భార్యను పిలిచి "ఇదిగో మీ ఆయన సంపాదన'' అంటూ తాను వాడి దగ్గర నుంచి వసూలు చేసిన సొమ్ము ఆమె చేతిలో పెట్టేసరికి ఆమె సాష్టాంగపడిపోయింది.

"అమ్మా ఎంత సల్లని మనసమ్మా మీది. ఈ డబ్బు మీకాడే ఉంచండమ్మా. ఆ డబ్బెట్టి ఆడికి సొంత రిచ్చా కొనిద్దురుగానీ'' అంది.

"వాడు సైకిల్ షాపు నడుపుతున్నాడుకదే'' అన్నారావిడ.

"సైకిల్ షాపులో కూకుంటే బద్దకం పెరిగి ఆడు మళ్లీ ఎదవేసాలు ఏత్తాడేమోనని బయమమ్మా. రిచ్చా కొనిత్తే సచ్చినట్టు బేరానికెల్లాల'' అంది ఆమె.

"గడుసుదానివే. నువ్వు నా దగ్గర పని చేయడానికి పనికొస్తావు. రేపట్నుంచి పనిలోకి రా'' అన్నారావిడ. ఆ పనిమనిషే మంగి.

★★★

ప్రతీ కార్తీక మాసంలోనూ తెల్లవారుఝామున లేచి ప్రతిరోజూ గోదావరి స్నానం చేయడం, చేతనైనవరకు దానధర్మాలు చేయడంలో మహాలక్ష్మమ్మగారి సాటి ఆ వూరిలో మరొకరు లేనేలేరు.

అయిదేళ్ల క్రితం ఒకరోజు ఉదయం అవతల వీధిలో హెల్త్ సూపర్‌వైజర్‌గారి భార్య, తాను స్నానం చేయడానికి వెళ్లారు. స్నానం చేసి పైకొచ్చాక ఆవిడ మహాలక్ష్మమ్మగారితో అంది-

"అయ్యో నా మతి మండ. ఆవునేతిలో వేసిన వత్తుల డబ్బా బుట్టలో పెట్టాననుకున్నాను. ఇంటికి వెళ్లి తెస్తాను వదినగారూ'' అంటూ బయల్దేరినావిడ. చీకట్లో పడిపోవడంతో మోకాలికి బాగా

గాయమవడం, ఆవిడ షుగర్ పేషెంట్ అవడంవల్ల అది తగ్గకపోవడం, రెండువారాల తరువాత ఆమె మరణించడం మహాలక్ష్మమ్మగారిని తీవ్ర మనస్థాపానికి గురి చేసింది. తాను వెలిగించుకునే వత్తులలో నాలుగు ఆవిడకి ఇచ్చి వుంటే ఆవిడ వెళ్లి ఉండేదికాదు, దెబ్బ తగిలి ఉండేదికాదు, ఆవిడ చనిపోయేదికాదు. ఇదంతా తన వల్లనే అని చాలాకాలానికిగాని మహాలక్ష్మమ్మగారు తేరుకోలేక పోయారు. అంతే! అప్పటినుంచి ప్రతీ కార్తీక మాసం మొదటి రోజునుంచీ చివరి రోజువరకూ ఆ వూరిలో ఏ ముత్తయిదువా స్నానానికి తన వెంట పూజాసామగ్రి ఏమీ తెచ్చుకోవలసిన అవసరం లేకుండా చేయగలిగిన పుణ్యాత్మురాలామె.

గోపాదాల రేవుకు ఎవరు వెళ్లినా వారి గుమ్మం దాటి వెళ్లాల్సిందే. ఆమె అరుగుమీద కూర్చుని పూజా సామగ్రి వున్న కేరీ బాగ్ అందించాల్సిందే. అతి చిన్న ఉద్యోగస్థుని భార్య నుండి పట్టణ ప్రథమ పౌరుని భార్య వరకూ అందరూ ఆమె పూజా సామగ్రి వాడినవారే.

తనకి నిద్రాభంగం కలగకూడదని ఎవ్వరైనా ముందుగానే లేచి వెళ్తారేమోనని తెల్లవారుఝామున రెండింటికే లేచి కూర్చుని ఇల్లంతా లైట్లు వేసి మంగి చేత వీధిలో కళ్లాపి చల్లించి, ముగ్గు పెట్టించి, వత్తులు చేసుకుంటూ లింగాష్టకమ్, శివ స్తోత్రం చదువుకుంటూ కూర్చునేవారు ఆవిడ.

"మీరింతటి సహాయపరులుకదా. మీరు వడ్డీ వ్యాపారం చేస్తారెందుకు?" అని ఎవ్వరైనా ప్రశ్నిస్తే-

"డబ్బు అవసరమైనవాడే అప్పు చేస్తాడు. అప్పు చేసినవాడు బాధ్యతగా ప్రవర్తిస్తాడు. ఒకవేళ బాధ్యత మరచిపోతే నష్టపోయేది నువ్వే అని తెలియజెప్పేందుకే వాడి వస్తువు గడువుతీరాక తీసేసుకుంటాను వాడు డబ్బు చెల్లించకపోతే. వాడు డబ్బు సకాలంలో చెల్లిస్తే బాధ్యతను సరిగా నిర్వర్తిస్తున్నట్టే లెక్క. వ్యవహారం వ్యవహారమే. సహాయం సహాయమే" అంటారావిడ,

వనజాక్షి ఆమె ప్రాణ స్నేహితురాలు. తన భర్తకు ఉద్యోగం సరైన సమయంలో రాక ముగ్గురు పిల్లలతో తాను సతమతమవుతుంటే తన కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకున్న అమృతమూర్తి. వనజాక్షి అంటే మహాలక్ష్మమ్మగారికి పంచప్రాణాలు.

అందుకే ఆవిడ వచ్చి సహాయం అడిగిన వెంటనే పదివేల రూపాయల సాయాన్ని చేసి స్నేహంపట్ల తనకున్న విలువను నిరూపించుకున్నారు మహాలక్ష్మమ్మగారు. అయితే అయిదునెలలలో వనజాక్షిగారు అసలు పదివేలు తీర్చేసి వడ్డీ ఇవ్వబోయారు. మహాలక్ష్మమ్మగారు వడ్డీ తీసుకోలేదు. అసలు తీసుకోవడమే తనకు అవమానంగా ఉందన్నారు. డబ్బువల్ల స్నేహానికి మాలిన్యం అంటకూడదని, అందుకే తాను అప్పుగా తీసుకున్న పదివేలు తిరిగి ఇస్తున్నాను అన్న వనజాక్షి మాటలకు వనజాక్షిగారిపైన అభిమానం మరింత పెరిగింది మహాలక్ష్మమ్మగారికి.

★★★

"మహాలక్ష్మి ఎక్స్‌పైర్డ్. స్టార్ట్ ఇమ్మీడియట్లీ" అన్న టెలిగ్రాం చూస్తూనే చేస్తున్న పని వదిలేసి భర్తతోపాటు బయల్దేరివచ్చారు వనజాక్షిగారు.

ఆమె భర్త శివరామయ్యగారిని కౌగలించుకుని మౌనంగా రోదిస్తూ ఉండిపోయారు రామభద్రయ్యగారు.

వనజాక్షిగారికి మహాలక్ష్మమ్మగారు నిద్ర పోతున్నట్టే అనిపించింది. ఆమె ఏదో సమయంలో కళ్ళు తెరిచి 'వదినగారూ' అని పిలుస్తారనే ఆశ కళ్లల్లో ప్రతిఫలిస్తుంటే సుళ్ళు తిరుగుతున్న కన్నీళ్లతో అలా ఆమెనే చూస్తుండిపోయారు. ఎందరో...ఎందరో వచ్చి ఆమెకు అంజలి ఘటించి వెళ్తున్నారు. అంతటి దుఃఖంలోనూ వనజాక్షిగారు సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు.

సాక్షాత్తూ పట్టణ ఛైర్మన్, ఎటువంటి రాజకీయ విబేధాలు లేకుండా అన్ని పార్టీలవారూ, వారి వారి కుటుంబాలతోసహా వచ్చి ఆమెకు కడసారి నమస్కరిస్తుంటే ఒక సాధారణ కుటుంబ స్త్రీకి ఇంతటి గౌరవమా? ఎంతటి అదృష్టవంతురాలామె అనుకున్నారు.

ఆమెవల్ల సహాయం పొందిన వారి రోదనలతో ఆ ప్రాంతం శోక సముద్రాన్నే తలపింపజేసింది. భర్తతోపాటు గోదావరి స్నానంచేసి తిరుగు ప్రయాణమైన వనజాక్షిగారితో శివరామయ్యగారు ఒక్కటే మాట అన్నారు-

"వనజా! డబ్బు ఎంతోమంది సంపాదిస్తారు. డొక్కా సీతమ్మగారు, మాగంటి అన్నపూర్ణమ్మగారు లాంటి దాతల పేర్లు అప్పుడప్పుడు స్మరించుకునే ఈ రోజుల్లో రామభద్రయ్యగారి భార్య సంపాదించుకున్న మంచితనం, అందరి మనసుల్లోనూ ఆమెకున్న స్థానం ఈవేళ చూడగలగడమే మనం చేసుకున్న పుణ్యం. అటువంటి స్నేహితురాలు ఉన్నందుకు నువ్వు, ఆమె సహాయంవలన ప్రాణం నిలుపుకున్న నేను ఎంతో అదృష్టవంతులం. ఆమె జీవితం ఇక మన శేష జీవితానికి ఆదర్శం."

★

## వింతైన మ్యూజియం

దేశ రాజధాని ఢిల్లీలో పబ్లిక్ టాయిలెట్లు కావాలంటే తెగ వెతుక్కోవాలి. ఎక్కడా కనిపించకపోతే అటూ ఇటూ చూసి కళ్లు మూసుకుని ఉదర భారాన్ని తగ్గించుకునే వాళ్లే ఎక్కువ. అటువంటి మహానగరంలో ఏకంగా 'టాయిలెట్స్' కోసం ఒక మ్యూజియం ఉండటం వింతే కాదు. వాస్తవం కూడా! ఈ మ్యూజియంలో చారిత్రక ప్రసిద్ధమైన టాయిలెట్లు వివిధ ఆకారాలలో, ఎన్నో రంగులలో, రకరకాల సైజుల్లో ఉండటం విశేషం. 'సులభ్ ఇంటర్నేషనల్ మ్యూజియమ్ ఆఫ్ టాయిలెట్స్' అని గర్వాతిశయంగా రంగురంగుల బొమ్మలతో అచ్చువేసిన బ్రోచరు కూడా ఈ మ్యూజియమ్‌లో లభ్యమవుతుంది. విక్టోరియా మహారాణి వాడిన టాయిలెట్ రత్నఖచితమైన పాలరాతి ఫలకాలమీద బంగారపు తొడుగులతో ఉంది. పన్నెండవ లూయిస్ రాజు ముఖంతో ముద్రితమైన 'కమోడ్' కూడా ఒకటి అక్కడ దర్శనమిస్తోంది. రాజుగారు ప్రైవేటుగా భోంచేసే వారు కానీ తన 'ఉదర' భారాన్ని మాత్రం పబ్లిక్‌లో దించుకునేవారని మ్యూజియం రికార్డులో ఓ చోట రాసి ఉంది. అలా తన ప్రజల ఎదుట 'భారం' దించుకోవటం తనకి శుభసూచకంగా భావించేవాడట ఆ మహారాజు. ఇదీ సంగతి!

-తటవర్తి రామచంద్రరావు

